కథా నిలయం
4718
1-5B
శ్రీకాకుళం

# ఉఫ్!

ఒకనాటి సంగతి చెపుతాను. వేసంకాలము సాయంత్రము గాలి కాస్త చల్లగా వీస్తున్నది. కృష్ణ వొడ్డున కులాసాగా కూర్చున్నాను. చుట్టుపక్కల ఏమీ లేదు. చల్లగాలికి తలమీది 'క్రాపు' ముఖము మీద పడుతూ వున్నది. ఇంతలో నాకు నిద్ర వచ్చినట్లయింది. ఏమో ఆలోచిస్తూ ఆ ఇసుక తిన్నెమీద నడుము వాల్చాను. అక్కడినుంచి ఏమేమో జరిగింది....

నిద్రలో ఎక్కడికో వెళ్ళానట. ఒక రోడ్డెపట్టి పోతున్నాను. పోగా పోగా రెండుకొండలు కనబడ్డవి. కొండల నడుమ ఒక కోన ఉన్నది. అందులో ఒక పెద్ద మేడ కనిపించింది. కోట గోడలవంటి గోడలు, ఇనపదూలాలు. ఎంతో జగన్మోహనముగా వున్నవి! లోపల ఎవ రున్నారో తెలియలేదు. అడగడాని కయినా బయట ఎవరూ కనబడలేదు. అయితే కొంచెము ధైర్యము చేసి, మేడలోపలికి అడుగువేశాను. తలుపులు, కిటికీలూ అట్టెట్టె కొట్టు కొంటున్నవి. ఒక చిన్నపిల్ల నాకెదురుగా వచ్చింది.

"అమ్మాయీ, ఈ మేడ యెవరిది?" అంటిని.

"మా నాన్నగారిది"

"మీనాన్నగారిది సరే, ఆయన ఎవరు?"

"గాలి దేవుడు"

"లోపలికి రావచ్చునా?"

"రావచ్చు."

లోపలికి వెళ్ళడము కష్టమనిపించింది. ఎదురు గాలిలో నడిచినట్లు వున్నది. గోడలు పట్టుకొంటూ ఏలాగో లోపలికి వెళ్ళినాను.

లోపల పెద్ద పెద్ద గదులు చాలా వున్నవి. ఒక పెద్దగదిలో గాలిరాజు నిద్రపోతున్నాడు. ఆయన చాలా భారీ మనిషి. ఆయన గురకపెట్టుతుంటే నాకు

గాభరా అయింది. ఆయన ముక్కు వెంట వచ్చేగాలికి మనము నిలుచోలేము. అబ్బా, యమగాలి!

**- 2 -**

లోపలికి వెళ్ళాను. అందరిలో చిన్నపిల్ల నన్ను చూసి పక్కున నవ్వింది. మనుషులను చూస్తే వాళ్ళకు చాలా నవ్వుగా వుంటుంది. ఆనవ్వుకు నాటోపీ ఎగిరిపోయింది. "తప్పు! అమ్మాయీ, తప్పు!" అని తల్లి కూకలు వేసింది. తరువాత వారు నాకు అతిథి సత్కారము చేయడానికి పీట వేసినారు. భోజనానికి కూర్చోమన్నారు. నేను వాళ్ళతో పాటు కూర్చున్నా నన్నమాటే గాని ప్రాణాలు బిక్కుబిక్కుమంటున్నవి. ఎవరు నవ్వితే నాపైబట్ట యెగిరిపోతుందో ఎవరు గట్టిగా మాట్లాడితే ఎగిరిపోతానో అని భయము వేసింది.

వాళ్ళు మన కూరలు మొదలయినవి తినరు. వారు తినేవి పాలూ, అన్నమూ, పాలతోనే రకరకాల పిండివంటలు చేశారు. 'మీ కిన్ని పాలు ఎక్కడివి?' అని నే నడిగితే, 'ఆకాశములో వున్న పాలతోవలో (కాశీ, రామేశ్వరాల తోవ, ఇంగ్లీషులో ది మిల్కివే అంటారు) పాలు ముంచుకొని వస్తాము' అన్నారు.

వాళ్ళ దుస్తుల సంగతివిన్నారూ? అక్కడే చాలా చిత్రము! మనమోస్తరు నేతబట్టలూ విలాతీమల్లూ కట్టుకోరు. మబ్బులే వాళ్ళ కట్టుబట్టలు. ప్రతిరోజూ, సాయంకాలము పడమటి దిక్కున సూర్యాస్తమయమప్పుడు కనబడే రంగురంగుల మబ్బులన్నీ గాలిదేవుడు చించుకువచ్చి తన పిల్లలకు కట్టుకోడానికి ఇస్తాడు. అది మరేమీ కష్టమైన పని కాదు. నోటితో ఉఫ్ అంటే మబ్బులన్నీ ముక్కలు ముక్కలు అయిపోతవి. మళ్ళీ ఉఫ్ అంటే కావలసినవి వచ్చి ఇంట్లో పడతవి. చూచారా ఎంత లాభమో!

గాలిదేవుడికి పాపము! తీరికే వుండదు, అస్తమానమూ ఆయన గాలి వూదుతూ వుండవలె. పాపము! కష్టమయినపని. ఈ పాడు చాకిరీచేయలేక ఆయన ఒక్కొక్కప్పుడు గట్టిగా ఉఫ్ ఉఫ్ అంటాడు. అప్పుడు సముద్రములో తుపాను పుట్టుతుంది. ఆయనకు విసుకుగా వున్నప్పుడు ఎవ్వరూ దగ్గిరికిపోరు. తుపాను వస్తే పడవలు స్టీమర్లూ తలకిందై పోతవి. అయితే అంత విసుగు ఆయన కెప్పుడో గాని పుట్టదు.

గాలిరాజు కఠినుడుకాడు. సముద్రములో పడవ వాళ్ళు పడేకష్టము చూచి, వాళ్ళకు కాస్త గాలి పంపిస్తూ వుంటాడు. ఆయన మరీ అలిసిపోతే ఆయన భార్య కొంత సేపు ఆ పని చేస్తుంది. ఆడవాళ్ళకు జాలి జాస్తి కాబట్టి అలిసిన ప్రయాణికులకు కాస్త గాలి విసురుతుంది.

గాలిదేవుడిపిల్లలు వట్టి ఆట ఖోరులు. వాళ్ళ ముఖాలు చూశారా? వాళ్ళు చక్కని చుక్కలు, కాని బుగ్గలు ఎర్రగా అయిపోయినవి. ఎప్పుడూ గాలి ఊదడమువల్ల కాబోలు! వాళ్ళ ఆటలుచూస్తే మరీ చిత్రము! సాయంత్రముపూట మేడమీది ఆఖరు అంతస్తుమీద ఆడుకుంటూ వుండి ఉబుసుపోక ఏ ఫ్రాన్సులోనో, ఏ లండనులోనో, ఏ ఢిల్లీలోనో (వాళ్ళకు అన్ని దేశాలూ దగ్గిరే) షికారు చేస్తూ వుండే వాళ్ళటోపీలు 'ఉఫ్' అని ఎగర గొడతారు. మంచి ఆటే వాళ్ళది!

సాయంత్రము మనము షికారు వెళ్ళేటప్పుడు మనకు హాయిగా తగిలేగాలి ఆపిల్లలు ఊదేదే; అందుకనే వాటిని పిల్లవాయువులంటారు.

ఇంతలో గాలిదేవుడు కూడా భోజనానికి వచ్చినాడు. ఆయనను చూసేసరికి పై ప్రాణాలు పైనపోయినవి. 'అయ్యబాబో! దుంప తెగింది!' అనుకొన్నాను. ఆయన ఆవలిస్తే సుడిగాలివచ్చి మనము కొట్టుకుపోవలసినదే. అయితే, అప్పుడటువంటిదేమీ జరగలేదు. ఆయన కూడా మాతో పాటు భోజనము చేసి, ఆ తరువాత ఊదడానికి వెళ్ళినాడు.

అప్పు డాయన భార్య నన్ను చూసి, "నీవింక వెళ్ళు. ఇప్పుడొక పెద్దగాలి వస్తుంది. మా ఆయన భుక్తాయాసము చేత నిట్టూర్పు విడుస్తారు. నీవు కొట్టుకుపోతావు! దబ్బున మీయింటికి చేరుకో!" అన్నది. సరే అని నేను టోపీ పెట్టుకొని వెనక్కు తిరిగేసరికి చిన్నపిల్ల తమాషాకు 'ఉఫ్' అన్నది. నాటోపీ ఎగిరి పదిగజాల దూరాన పోయిపడ్డది. అది తీసుకొని నవ్వుతూ బయలుదేరినాను.

ఇంటి ముందరికి వచ్చానో లేదో వెనక నుంచి పెద్దసుడిగాలి లాటి గాలి కొట్టింది! ఆ గాలికి నేను బొక్క బోర్లాపడ్డాను. దానితో మెళకువ వచ్చింది. లేచి చూసేసరికి పొద్దు గూకి చీకటి పడ్డది. ఆపళముగా పక్క వేసిన ఉత్తరీయము ఝాడించి పైనవేసుకొని లేచి యింటిదోవ పట్టినాను.

*(సాహితీ ద్వైమాస పత్రిక, జనవరి 1920)*